TGTEL/25/A3750

... నిజమే ...

# నిజాయితీ

https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొడ్డుపల్లి మల్లయ్య  సంపుటి 1  సంచిక 02  ప్రింటర్ : గుండూర్ శ్యామ్ . మంగళవారం 18 నవంబర్ 2025  వెల 4:00

"నిజాయితీ" ఒక ముఖ్యమైన నైతిక లక్షణం ఇది విశ్వసనీయత, విధేయత మరియు సమగ్రతను పెంచుతుంది.



# సౌదీలో ఘోర ప్రమాదం

- మృతులు 45 మంది హైదరాబాద్ వారే
- ఒకే కుటుంబం వారు 8 మంది
- మరో కుటుంబ వారు 7 మంది





**నిజాయితీ, హైదరాబాద్ :** సౌదీ అరేబియా, మదర్-మదీనా హైవే పై భారతీయ యాత్రికులను తీసుకుని ప్రయాణిస్తున్న బస్సు ముఫరహత్ ప్రాంతంలో డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో ఘోర ప్రమాదం జరిగింది. ఈ? ఘటనలో 45 మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు.

దుర్ఘటన సమాచారం అందిన వెంటనే సౌదీలోని భారత రాయబారి కార్యాలయం అత్యవసర సహాయక చర్యలు ప్రారంభించింది. క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదంపై భారత ప్రభుత్వం తీవ్ర విచారం వ్యక్తం చేసింది. కేంద్ర హోంవిభాగం, విదేశాంగ శాఖ సమన్వయంతో బాధిత కుటుంబాలకు సహాయక చర్యలు చేపడుతోంది.

దుర్ఘటన నేపథ్యంలో 24ఐ7 హెల్ప్‌లైన్ నంబర్లు కూడా అందుబాటులో ఉంచినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

## 5 లక్షల చొప్పున నష్ట పరిహారం ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్

**నిజాయితీ, హైదరాబాద్ :** సౌదీ ఆరేబియాలో మక్కా నుంచి మదీనాకు ప్రయాణిస్తున్న బస్సు ప్రమాదానికి గురైన దుర్ఘటనలో మరణించిన బాధిత కుటుంబాలకు 5 లక్షల రూపాయల చొప్పున పరిహారం అందించాలని రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయించింది.

ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ గారి నేతృత్వంలో ఎంఐఎం ఎమ్మెల్యే, మైనారిటీ విభాగానికి చెందిన ఒక అధికారితో కూడిన ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని వెంటనే సౌదీ అరేబియాకు పంపించాలని మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది.

చనిపోయిన వారి కుటుంబ సభ్యుల నిర్ణయం మేరకు మృతదేహాలకు మత సంప్రదాయాల ప్రకారం అక్కడే అంత్యక్రియలు చేయాలని, అందుకోసం బాధిత కుటుంబ సభ్యులను ఒక్కో కుటుంబం నుంచి ఇద్దరిని సౌదీ అరేబియా తీసుకెళ్లడానికి వీలుగా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు.

## సౌదీ దుర్ఘటనపై కేంద్రం ప్రత్యేక దృష్టి



- ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు
- బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండ
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

**నిజాయితీ, కరీంనగర్ :**
సౌదీ అరేబియాలో బదర్%-%మదీనా మధ్య ముఫరహత్ ప్రాంతంలో భారత యాత్రికుల బస్సు డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టిన ఘటనలో 42 మంది మరణించడంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషయంపై విదేశాంగ, హోంమంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. బాధితుల సహాయార్థం కేంద్రం యుద్ధ ప్రాతిపదికన చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. సౌదీలోని భారత రాయబారి కార్యాలయం తక్షణ సహాయక చర్యలు చేపట్టిందని, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా స్వయంగా సౌదీ అధికారులతో మాట్లాడు తున్నారని చెప్పారు.

**24/7 కంట్రోల్ రూమ్ - హెల్ప్‌లైన్ నంబర్లు:**

**8002440003 (టోల్ ఫ్రీ) 0122614093**

**0126614276 0556122301**

ఈ నంబర్ల ద్వారా బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయం అందించేలా ఏర్పాట్లు చేసినట్లు బండి సంజయ్ తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని, మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

భవిష్యత్తులో యాత్రికుల భద్రతను మరింత బలోపేతం చేసేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి - కలెక్టర్ బాదావత్ సంతోష్, ప్రజావాణిలో 48 దరఖాస్తులు



**నిజాయితీ, నాగర్‌కర్నూల్ :**
రాష్ట్ర, జిల్లా, స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి సంబంధించి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రజావాణి మీటింగ్ హాలులో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి 48అర్జీలు అందాయి, జిల్లా అదనపు కలెక్టర్లు అమరేందర్,దేవ సహాయం తో కలిసి కలెక్టర్ అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ%ళా% అధికారులందరూ తమ పరిధిలో ఇప్పటివరకు ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు కార్యాలయాల స్థాయిలో పరిష్కరించలేని దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన తప్పనిసరిగా చేయాలని, పరిశీలన అనంతరం ఆన్‌లైన్ ప్రజావాణి పోర్టల్ ద్వారా దరఖాస్తుదారులకు స్పష్టమైన మరియు పారదర్శకమైన సమాధానం ఇవ్వాలని సూచించారు. తమ పరిధిలో పరిష్కరించలేని సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, సంబంధిత వివరాలను ఆన్‌లైన్‌లోనే దరఖాస్తుదారుకు స్పష్టమైన వివరణ రూపంలో పంపించాలని అధికారులు ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ విభాగాల అధికారులు, జిల్లాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సంకల్పం ఉంటే వైకల్యం అడ్డురాదని నిరూపించిన యువ క్రీడాకారులు ధనుష్

### అభినందించిన తెలంగాణ ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి



**నిజాయితీ, హైదరాబాద్ :**
పాన్‌లో జరుగుతున్న డెఫ్లింపిక్స్ (బధిర) స్పోర్ట్స్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో స్వర్ణ పతకం సాధించి దేశ కీర్తిని చాటిన హైదరాబాద్ షూటర్ ధనుష్ శ్రీకాంత్‌కు ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు అభినందనలు తెలిపారు. సంకల్పం ఉంటే వైకల్యం అడ్డురాదని ధనుష్ నిరూపించి యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచారని ప్రశంసించారు. స్వర్ణ పతకం సాధించడమే కాకుండా 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో సరికొత్త ప్రపంచ రికార్డును సృష్టించిన ధనుష్ శ్రీకాంత్, భవిష్యత్తులో మరిన్ని రికార్డులను సాధించాలని, ఆత్మవిశ్వాసం, పట్టుదలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలబడుతుందని చెప్పారు.

## మతోన్మాదులను అడ్డుకునేందుకు వామపక్షాలు ఐక్యం కావాలి

### సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాల్ నరసింహా

### ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే కమ్యూనిస్టు జెండాను ప్రతి ఒక్కరు పట్టాలి - సిపిఐ ఎంఎల్‌సి నెల్లికాటి సత్యం

**నాగర్ కర్నూలు జిల్లా తెల్కపల్లి లో మూడవ రోజు బస్సు జాతా....**

**నిజాయితీ,తెల్కపల్లి :**
మతతత్వ, పెట్టుబడిదారీ బీజేపీని తరిమికొట్టేందుకు వామపక్షాలను బలోపేతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బల్ నరసింహ అన్నారు. సీపీఐ శతవసంతాల సందర్భంగా ఖమ్మంలో డిసెంబర్ 26న జరుగనున్న వందేళ్ల ముగింపు సభను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం గద్వాల్ నుండి ప్రారంభమైన సీపీఐ బస్సు జాతా ఆదివారం వనపర్తి అమరచింత జిల్లాలోని పలు మండలాలలో కొనసాగింది.సోమవారం ఉందయం మహబూబ్నగర్ జడ్చర్ల నుండి మన నాగర్ కర్నూల్ జిల్లాకు రావడం జరిగింది తిమ్మాజిపేట మండలం నుండి బిజినపల్లి నాగర్ కర్నూల్ నుండి మన తెల్కపల్లి మండలానికి రావడం జరిగింది ఈ సందర్భంగా సీపీఐ నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్



అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికట్టి సత్యం ప్రసంగించారు. దేశంలో మతోన్మాద శక్తులను అడ్డుకునేందుకు ఎర్ర జెండా పార్టీలన్నీ ఒక తాటి పైకి రావాలన్నారు. మావోయిస్టులు సైతం కమ్యూనిస్టులతో కలిసి కావాలని, తద్వారా కేంద్రంలోని ప్రజా వ్యతిరేక బీజేపీకి అడ్డుకట్టవేయవచ్చునని చెప్పారు. దేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వందేళు పూర్తి కావస్తున్నదని, గడిచిన వందేళ్లలో దేశంలో పేద ప్రజలు, కార్మికులు, రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై నిరంతరం పోరాడిన ఘనత సీపీఐదేనని చెప్పారు. దేశాన్ని బ్రిటిష్ పాలన నుండి విముక్తి చేసిందని, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నిర్వహించి నిజాం రాచరిక పాలన నుండి విముక్తి చేసి ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాన్ని కల్పించిన చరిత్ర సీపీఐకి మాత్రమే ఉందన్నారు. నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బడా పెట్టుబడి దారులు, కార్పొరేట్ శక్తులతో చేతులు కలిపి ప్రజల భవిష్యత్తును అంధకారం చేస్తుంటే, బీజేపీకి వ్యతిరేకంగా వామపక్ష, ప్రజాతంత్ర శక్తులను ఏకం చేసి పోరాటాలు నిర్వహిస్తున్నదని అన్నారు. అలాంటి సీపీఐ వందేళ్ల ముగింపు ఉత్సవాలను డిసెంబర్ 26న ఉద్యమాల గుమ్మం ఖమ్మంలో భారీ ఎత్తున నిర్వహించేందుకు సిద్దం అవుతున్నదని అన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి బస్సు జాతాలను నిర్వహించడం జరుగుచున్నదని చెప్పారు. ఈ జాతా కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కె కేశవులు గౌడు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు టి నరసింహ విజయుడు జిల్లా కౌన్సిల్ సభ్యులు బాలమురళీకృష్ణ శంకర్ గౌడ్ పరశురాములు డాక్టర్ శ్రీనివాసులు నారాయణరెడ్డి తెల్కపల్లి మండల కార్యదర్శి వేనేపల్లి రవీందర్ యువజన సంఘం దేశామోని ఆంజనేయులు నరేందర్ రెడ్డి తుమ్మల శివుడు శివ కృష్ణ రాములు విష్ణు శంకర్ బుగ్గ స్వామి లక్ష్మణ్ సితదితరులు పాల్గొన్నారు.